పది ఫలితాలపై గురి



ఉపాధ్యాయురాలి పర్యవేక్షణలో బాలికల స్టడీ అవర్

- నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు
- తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశాలు
- అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

గిద్దలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అనూహ్య మార్పులు తీసుకొచ్చింది. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తెచ్చేందుకు అహర్నిశలూ ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే ప్రభుత్వం డీసీఈబీ (డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు) ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలలోని పదో తరగతి చదువుతున్న విద్యార్థులు నూరు శాతం పాసయ్యేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపకల్పన చేస్తోంది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 46 ప్రభుత్వ, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో సమ్మెటివ్ అసెస్మెంట్ కింద జనవరిలో పరీక్షలు నిర్వహించారు. అందులో ఫెయిలైన విద్యార్థులను సైతం పాస్ చేసేందుకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించి నూరు శాతం పాస్ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసింది. ఆదివారం, రెండో శనివారం వంటి సెలవు రోజుల్లో సైతం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. దీంతో పాటు విద్యార్థులు పాస్ మార్కులు సాధించేందుకు వారిలో పరీక్షల భయం పోగొట్టేందుకు అవసరమైన అన్ని ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.



ముండ్లపాడు స్కూల్లో ప్రత్యేక తరగతులు

చదువుకు ప్రాధాన్యం

చదువుకు ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. ప్రత్యేక తరగతుల ద్వారా వారిలో దాగి ఉన్న విద్యను మరింత మెరుగు పరుస్తున్నాం. గత సంవత్సరం పాఠశాలలో మొత్తం 92 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందులో 88 మంది పాసయ్యారు. నలుగురు మాత్రమే ఫెయిలయ్యారు. 600 మార్కులకు 556 మార్కులు సాధించారు.

– గిరిధరశర్మ, హెచ్ఎం, ముండ్లపాడు

ఇష్టపడి చదివితే పాసవ్వడం కష్టం కాదు

పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటూ ఇష్టపడి చదివితే 10వ తరగతే కాదు ఏపరీక్షల్లోనైనా నెగ్గడం సులభం. గతేడాది మా పాఠశాల విద్యార్థులు 76.3 శాతం పాసయ్యారు. ఇద్దరు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీ సాధించారు. ఈ ఏడాది 100 శాతం విద్యార్థులు పాసయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– లక్ష్మీదేవి, హెచ్ఎం, జెడ్పీ ఉన్నత పాఠశాల, గిద్దలూరు

రుణాలు సకాలంలో చెల్లించాలి



మాట్లాడుతున్న స్త్రీ నిధి ఏజీఎం హర్షవర్ధన్

దొనకొండ: డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి మళ్లీ రుణాలు పొందాలని స్త్రీ నిధి ఏజీఎం హర్షవర్ధన్ సూచించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం డ్వాక్రా మహిళలకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న తోడు, ఉగాది హౌసింగ్ లోను తీసుకున్న గ్రూపులు ఆడిట్ త్వరగా పూర్తి చేయాలన్నారు. సామాజిక పెట్టుబడికి తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. డీపీఎం శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ ఉన్నతి పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు రుణాలు ఇప్పించాలని, పొందిన రుణాలు వంద శాతం రికవరీ చేయించాలన్నారు. ఏరియా కో ఆర్డినేటర్ వసుంధరాదేవి మాట్లాడుతూ స్త్రీ నిధి రుణాలు మన మండలానికి రూ.18 కోట్లు టార్గెట్ ఉందని, అవసరమైన పేద వాళ్లకు జీవనోపాధి కింద ప్రతి మహిళకు రూ.50 వేలు రుణం ఇవ్వొచ్చని తెలిపారు. ఫైనాన్స్ డీపీఎం నరసింహారావు మాట్లాడుతూ ప్రతి గ్రూపు రుణాలు పొంది ఆ రుణాలతో జీవనోపాధి సాగించి మళ్లీ రుణాలు పొందాలని వివరించారు. సమావేశంలో ఏపీఎం జి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. వీఓఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వెలుగొండలో వస్తు విక్రయ వేలం

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని పలు రకాల వస్తువులు విక్రయించుకునేందుకు శుక్రవారం వెలుగొండ దేవస్థానంలో ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సాని కొమ్ము తిరుపతిరెడ్డి పర్యవేక్షణలో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. వచ్చే నెల 8వ తేదీ నుంచి 19వ తేదీ వరకు పూజా ద్రవ్యాలు, కొబ్బరికాయలు అమ్ముకొనేందుకు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకొనేందుకు, బ్రహ్మోత్సవాలు ముందు రోజు నుంచి మళ్లీ వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాలు ముందు వరకు తలనీలాలు పోగు చేసుకునేందుకు వేలం నిర్వహించారు. హక్కుదారులు ముందుగా రూ.10 వేల ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. కొబ్బరి కాయల అమ్ముకొనేందుకు రూ.2.66 లక్షలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు రూ.45 వేలు, తలనీలాలు పోగు చేసుకునేందుకు రూ.1.19 లక్షలు వేలం జరిగింది. మార్చి 8వ తేదీ నుంచి వెలుగొండస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని వివరించారు.



వేలం నిర్వహిస్తున్న ఈఓ, చైర్మన్

క్లుప్తంగా

నారు ఆరోగ్యంగా పెంచాలి



మహిళా రైతులతో మాట్లాడుతున్న ప్రసాదరావు

తాళ్లూరు: నారు నాణ్యంగా ఆరోగ్యంగా పెంచితే పైరు బలంగా ఏపుగా పెరుగుతుందని, చీడ పీడలను తట్టుకుని మంచి దిగుబడులు వస్తాయని వ్యవసాయాధికారి ప్రసాదరావు అన్నారు. తోట వెంగన్నపాలెంలో శుక్రవారం క్షేత్ర పర్యటనలో భాగంగా నారు మడులను ఆయన పరిశీలించారు. పోషకాల లోపం లేకుండా జింక్, ఐరన్‌లతో కూడిన పోషకాలు అందించాలని కోరారు. ఉల్లి కోడు, కాండం తొలిచే పురుగులు ఆశించకుండా 3జి గుళికలు నారు మడికి 150 గ్రాముల చొప్పున వెయ్యాలని సూచించారు. ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఆశించిన దిగుబడులు వస్తాయని తెలిపారు.

దాతృత్వం చాటుకున్న కొమరోలు ఎస్ఐ



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎస్ఐ సుబ్బరాజు

కొమరోలు: స్థానిక ఎస్ఐ సుబ్బరాజు దాతృత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని చింతలపల్లెకు చెందిన వెంకటస్వామి హనుమంతరాయునిపల్లె సమీపంలో రహదారి ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన కుటుంబం ఆర్థికంగా చితికి పోవడంతో ఎస్ఐ సుబ్బరాజు శుక్రవారం చింతలపల్లె గ్రామానికి వెళ్లి వెంకటస్వామి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల నగదు, బియ్యం, నిత్యవసర సరుకులు అందచేశారు. నలుగురు పిల్లలకు దుస్తులు అందచేశారు. ఎస్ఐ సుబ్బరాజుకు మృతుడి భార్య రంగమ్మ కృతజ్ఞతలు తెలిపారు. ఏఎస్ఐ గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ జనార్దన్ నాయుడు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి రూ.లక్ష సాయం



నగదు అందజేస్తున్న ఎంపీడీవో చందన

మార్కాపురం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తోందని, లబ్ధిదారులు ఉపయోగించుకోవాలని ఎంపీడీవో చందన కోరారు. శుక్రవారం మండలంలోని గజ్జలకొండ జగనన్న లేఔట్‌ను ఆమె పరిశీలించి వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా పొదుపు గ్రూపుల్లో ఉన్న ఐదుగురు సభ్యులకు లక్ష రూపాయల రుణాలు అందించారు. ఉగాది నాటికి గృహాలు పూర్తి చేయాలని సూచించారు. వెలుగు ఏపీఎం రమేష్‌బాబు, హౌసింగ్ ఏఈ చందు, సిబ్బంది పాల్గొన్నారు.

తర్లుపాడు తహసీల్దార్‌గా వరకుమార్



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తర్లుపాడు: తర్లుపాడు తహసీల్దార్‌గా డీవీబీ వరకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను కార్యాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటానని, రెవెన్యూ సమస్యలుంటే తనను సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం వీఆర్ఓ, సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీటీ శ్రీనివాసులు, వీఆర్ఓలు, సచివాలయ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

పొగాకు వేలం ప్రారంభం



వేలం ప్రారంభంలో రైతు సంఘ నాయకులు

పొదిలి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం పొగాకు అమ్మకాలు ప్రారంభమయ్యాయి. వేలం అధికారి గిరిరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో వేలం జరిగింది. వేలం కేంద్రం పరిధిలోని ఆముదాలపల్లి, గురుగుపాడు, మంగాపురం, వాగుమడుగు గ్రామాల రైతులు మొత్తం 27 బేళ్లను వేలంలో ఉంచారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీ ప్రకారం 27 బేళ్లను మాత్రమే వేలంలో ఉంచుతారు. మొత్తం బేళ్లకు ఒకే ధర పలికింది. కిలో రూ.200లు ధర పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వేలం ముగిసేంత వరకు పొగాకుకు అధిక ధరలు ఇవ్వాలని రైతులు కోరారు. ముందుగా పూజలు నిర్వహించి కొబ్బరి కాయలు కొట్టారు. ఎక్స్‌టెన్షన్ మేనేజర్ దామోదర్, రైతు సంఘ నాయకులు గుంటూరు సుబ్బయ్య, ఎస్.వెంకటేశ్వరరెడ్డి, దండే వీరనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రైల్వే ఆస్తులను రక్షించాలి

గిద్దలూరు రూరల్: రైల్వే ఆస్తులను రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నంద్యాల ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వి.భాస్కర్ అన్నారు. రైలు బండ్లపై రాళ్ల దాడికి వ్యతిరేకంగా మండలంలోని దిగువమెట్ట రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రజలకు శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైల్వే ఆస్తులను ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే రైల్వే సేవలను గుర్తించి వాటిని స్వాగతించాలన్నారు. ఆర్పీఎఫ్ పోలీసులు శ్రీనివాసరావు, శేషగిరి, నాయబ్‌రసూల్ ఉన్నారు.

ఉగాది నాటికి గృహ ప్రవేశాలు



కొమరోలులో జగనన్న కాలనీలో ఇంటిని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సాయికుమార్

పుల్లలచెరువు: జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయాలని ప్రత్యేకాధికారి సాయికుమార్ సూచించారు. శుక్రవారం కొమరోలు గ్రామంలోని జగనన్న కాలనీ లేఔట్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాన్ని అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తప్పనిసరిగా లేఔట్లను పరిశీలించాలని చెప్పారు. ఆయన వెంట ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, తహసీల్దార్ దాసు, హౌసింగ్ అధికారులు, కార్యదర్శులు ఉన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

బేస్తవారిపేట: మండలంలోని జేబీకే పురంలో శనివారం మార్కాపురం ఎల్వీ ప్రసాద్ వైద్యశాల ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు పి.గోపాల్ తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించడం, అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు పేర్కొన్నారు. జేబీకే పురం పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థిక అక్షరాస్యతతో మోసాలకు అడ్డుకట్ట



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

పెద్దారవీడు: బ్యాంకు ఖాతాదారులు ఆర్థిక అక్షరాస్యత సాధిస్తే మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చని మేనేజర్ ఎస్‌కే కరీమా అన్నారు. మండలంలో ఓబులక్కపల్లె గ్రామంలో శుక్రవారం హనుమాన్ జంక్షన్ కుంట ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు అధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై బుర్రకథ రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. డిజిటల్ లావాదేవీలు చేసే క్రమంలో చోటుచేసుకుంటున్న సైబర్ నేరాలపై ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జీవనజ్యోతి, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వంటి పథకాలను వినియోగించుకోవాలని, సకాలంలో రుణాలు కట్టిన వారికి మాత్రమే ప్రభుత్వం ఇస్తున్న రాయితీ వర్తిస్తుందన్నారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మణ్‌అనిల్‌కుమార్, క్యాషియర్ కోటిబాబు, బ్యాంకు సిబ్బంది, హరినారాయణ, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

టీఏఆర్ఎల్ మెటీరియల్ పంపిణీ



హెచ్ఎంలకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ

పుల్లలచెరువు: కరోనా కారణంగా విద్యలో వెనుకబడిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని వారి స్థాయికి తగ్గ బోధన అందించాలనే ఉద్దేశంతో టీచింగ్ ఎట్ రైట్ లెవెల్ ప్రోగ్రాం(టీఏఆర్ఎల్) మెటీరియల్‌ను శుక్రవారం ఉపాధ్యాయులకు ఎంఈఓ శామ్యూల్‌జాన్ అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారు ఉత్సాహంతో విద్యనభ్యసించడానికి తగిన మెటీరియల్‌ను ప్రతి పాఠశాలకు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారం కోసం వినతి

గిద్దలూరు రూరల్: రైతుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ జిల్లా రైతు సంఘ అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో రైతులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరావును కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల రైతుల ఉపయోగం కోసం గుండ్లమోటు, తెలుగు గంగ అనుసంధానం చేయాలని, వెలుగొండ పడమర కాలువ, రాచర్ల రామన్న కత్తువ, అర్ధవీడు మండలం రాళ్లవాగు ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రూ.వెయ్యి కోట్లు విడుదల చేయాలని వినతి పత్రంలో కోరారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక లక్ష్మీ పూజ



కుంకుమార్చనకు హాజరైన భక్తులు

మార్కాపురం టౌన్: శ్రీదేవీ, భూదేవీ సమేత అమలక లక్ష్మీనారాయణస్వామి (వెంకచ్చమ్మ గుడి) 60వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో శుక్రవారం సామూహిక లక్ష్మీ పూజ, కుంకుమార్చన చేశారు. స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకం, సహస్ర నామార్చన నిర్వహించిన అనంతరం విష్ణు సహస్రనామ పారాయణం భక్తులు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. శనివారం స్వామివారి అగ్ని ప్రతిష్ఠ ధ్వజారోహణం జరుగుతుందని, అనంతరం కల్యాణం సాయంత్రం గరుడోత్సవం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ డీవీ కృష్ణారెడ్డి, పాలెం చెంచయ్య తెలిపారు.

అరటిపండ్ల లారీ బోల్తా

మార్కాపురం: అరటిపండ్ల లోడుతో వెళ్తున్న లారీ టైరుపేలి బోల్తా పడింది. ఈ సంఘటన మండలంలోని తిప్పాయపాలెం సమీపంలో శుక్రవారం జరిగింది. పోరుమామిళ్ల నుంచి వినుకొండ వెళ్తుండగా తిప్పాయిపాలెం సమీపంలోకి రాగా టైరుపేలి బోల్తాపడింది. డ్రైవర్‌కు స్వల్పగాయాలు కాగా వెంటనే జిల్లా వైద్యశాలకు తరలించారు. రోడ్డుకు అడ్డంగా వాహనం పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. రూరల్ ఎస్ఐ సుమన్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

వైవీ భద్రారెడ్డిని సన్మానించిన జేసీఎస్ కన్వీనర్



భద్రారెడ్డిని సన్మానిస్తున్న యాడిక, ఎంపీపీ, జెడ్పీటీసీ

తాళ్లూరు: వైఎస్సార్‌సీపీ నాయకుడు, అద్దంకి ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డిని తాళ్లూరు మండల సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒంగోలులో కలిసి సన్మానించారు. తనను జేసీఎస్ కన్వీనర్‌గా నియమించేందుకు సహకరించినందుకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, భద్రారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి ప్రతి నాయకుడిని కలుపుకుని, గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి పూర్తి స్థాయిలో కృషి చెయ్యాలని యాడికకు భద్రారెడ్డి సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దిశెట్టి రవీంద్ర, డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్‌ల నమ్మకాన్ని నిలుపుకుంటానని చెప్పారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, సర్పంచి పీఎస్ శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

బిందు సేద్యంతో నీరు ఆదా

పెద్దారవీడు: బిందు సేద్యం పద్ధతిలో కొద్దిపాటి నీటితో పంటలు సాగు చేసుకోవచ్చని ఉద్యానశాఖ అధికారి పి.ఆదిరెడ్డి తెలిపారు. పెద్దారవీడు పరిధిలో మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు కింద డ్రిప్ పైపులు తీసుకున్న రైతుల పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న డ్రిప్‌ను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మూడేళ్ల వరకు ఏదైనా సమస్య వస్తే కంపెనీనే మరమ్మతులు చేస్తుందని చెప్పారు. డ్రిప్ ద్వారా పంటలకు ఎరువులు అందించే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎంఐఏఓ వెంకటేశ్వర్లు, వీఏఏ డి.ఆదిలక్ష్మి, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు బిందు సేద్యంపై అవగాహన కల్పిస్తున్న హెచ్ఓ ఆదిరెడ్డి

ఉగాది నాటికి ఇళ్లు పూర్తి చేయాలి

- హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ చెన్నయ్య

తర్లుపాడు: ఉగాది నాటికి జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు పూర్తిచేసి గృహ ప్రవేశాలకు లబ్ధిదారులు సిద్ధంగా ఉండాలని హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య అన్నారు. శుక్రవారం ఆయన తర్లుపాడులో జగనన్న లేఔట్ కాలనీని సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. జగనన్న కాలనీల్లో అధికారులంతా సమన్వయంతో పని చేసి కనీస సౌకర్యాల కల్పనపై దృష్టిసారించాలన్నారు. నిర్మిస్తున్న కాలనీల్లో విద్యుత్, నీటి సౌకర్యం, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా డ్వాక్రా మహిళలకు అందిస్తున్న బ్యాంకు రుణాలు వినియోగించుకోవాలన్నారు. లబ్ధిదారులకు 10 మందికి 10 వేల రూపాయల చొప్పున గ్రూపు నుంచి ఆర్థిక సాయం అందించారు. ఈఈ వెంకటస్వామి, డీఈఈ పవన్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎండీపీవో నరసింహులు, హౌసింగ్ ఏఈ నిర్మల్‌బాబు, ఏపీఎం పిచ్చయ్య, విద్యుత్ ఏఈ హనుమాన్‌నాయక్ పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ చెన్నయ్య

సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలి

అర్థవీడు (కంభం): ప్రజాసమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ వెంకట్రావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూడాలన్నారు. పలు గ్రామాల్లో శ్మశానాలకు స్థలం కేటాయించాలని, కొన్ని చోట్ల మరమ్మతులు చేయించాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన సెబ్, మెడికల్, ఫారెస్టు, సోషల్ వెల్ఫేర్ శాఖల అధికారులకు సంజాయిషీ నోటీసులు ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ వీరభద్రాచారి తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు చెన్ను విజయ, తహసీల్దార్ రవిబాబు, అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకట్రావు

దళిత మహిళలపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

పొదిలి: దళిత మహిళలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని స్థానిక ఏబీఎం పాఠశాల వద్ద పలు ప్రజా,దళిత సంఘాల నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్, పూలే విగ్రహాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. జువ్వలేరులో సంఘటన జరిగి రోజులు గడుస్తున్నా కారణమైన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని బీసీ సంక్షేమ సంఘ జిల్లా ప్రదాన కార్యదర్శి అన్నవరం వెంకటేశ్వరరావు ఆరోపించారు. రాష్ట్ర దళిత సేన ప్రధాన కార్యదర్శి గర్నెపూడి ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ సంఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా విచారణ పేరుతో పోలీసులు కాలయాపన చేస్తున్నారని, నిందితులు గ్రామంలోనే తిరుగుతున్నారన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి తగు చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సంఘాల నాయకులు అశోక్, సైదయ్య, మాదిగ మహానాడు కన్వీనర్ గట్టుపల్లి ప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు జూపల్లి కోటేశ్వరరావు, తాళ్లూరి లాజర్, రావినూతల వెంకటయ్య పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

జమ్మనపల్లెలో బోరు తొలగింపు

మార్కాపురం: మండలంలోని జమ్మనపల్లెలో బోరు తొలగింపులో గ్రామస్తుల మధ్య శుక్రవారం స్వల్ప వివాదం తలెత్తింది. అధికారులు, పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. గ్రామంలో కొంత మంది అనధికారికంగా బోరు వేయడంతో నీటి సమస్య ఏర్పడిందని స్పందనలో అర్జీ ఇచ్చారు. దీంతో అధికారులు విచారణ చేసి ప్రభుత్వ బోరుబావి దగ్గరలో ప్రైవేటు వ్యక్తులు బోరు వేయడంతో నీటి సమస్య ఏర్పడిందని గుర్తించి తొలగించేందుకు ఎంపీడీఓ చందన, రూరల్ ఎస్ఐ సుమన్ వెళ్లారు. బోరు తొలగించవద్దంటూ వాగ్వాదం జరిగిన అనంతరం ఒక బోరు తొలగించారు. వోల్టా చట్టానికి వ్యతిరేకంగా ఉన్నందున తొలగించినట్లు ఎంపీడీఓ తెలిపారు. గ్రామంలో నీటి సమస్యను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ చందన

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పొదిలి: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. నంద్యాల రోడ్డులో కంభాలపాడు, పోతవరం గ్రామాల మధ్య సబ్‌ స్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం తగిలి, గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నేడు బహిరంగ వేలం

కొమరోలు: స్థానిక పోలీసుస్టేషన్‌లో ద్విచక్ర వాహనాల బహిరంగ వేలాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ఎ.సుబ్బరాజు తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు వెయ్యి రూపాయలు డిపాజిట్ చేయాలని సూచించారు. ఆసక్తి ఉన్న వారు పోలీసుస్టేషన్‌లో సంప్రదించి నగదు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని సంఘ జిల్లా అధ్యక్షురాలు వెంకటరత్నం ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆమె మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతన్న నిత్యావసర వస్తువుల ధరలతో తాము కుటుంబ పోషణ కోసం ఇబ్బందులు పడుతున్నామని, వేతనాలు పెంచాలని, రిటైర్మెంట్ వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలని కోరారు. జిల్లా కార్యదర్శి రేణుక, ఏఐటీయూసీ కార్యదర్శి ఎస్‌కే ఖాశీం, యూనియన్ నేతలు ధనలక్ష్మి, ఆకుల పద్మ, లక్ష్మి, పద్మ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

27న మండల సమావేశం

రాచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.కవితా చౌదరి తెలిపారు. సర్వసభ్య సమావేశానికి మండల మండల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆమె కోరారు.